## సీఎం రేసులో నేనూ ఉన్నా: బసవరాజ రాయరెడ్డి

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎం కావాలని చాలామందికి ఆకాంక్ష ఉందని, సిద్దరామయ్య కాకుండా మరొకరి పేరు వస్తే తాను కూడా రేసులో ఉంటానని సీఎం ఆర్థిక సలహాదారుడు బసవరాజ రాయరెడ్డి అన్నారు. కొప్పళలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కల్యాణ కర్ణాటకకు ముఖ్యమంత్రి పదవి ప్రస్తావన వస్తే తానే ప్రథమస్థానంలో ఉంటానని అన్నారు. సిద్దూ మరో మూడున్నరేళ్ల సీఎంగా ఉంటే రాష్ట్రం అభివృద్ధి అవుతుందన్నారు. సీఎం కావాలని ఆర్‌వీ దేశ్‌పాండే చెప్పడంలో తప్పు లేదన్నారు. లింగాయత సామాజికవర్గాన్ని పరిశీలిస్తే తనకు అవకాశం ఇవ్వాలన్నారు.





హాసన్ జిల్లాలో ఎత్తిపోతల పథకం తొలివిడత ప్రాజెక్టు ఇదే

ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ (ఫైల్)

# ఎత్తిపోతలకు కేంద్రం కొర్రీ

● బయలుసీమ జిల్లాలకు నిరాశ ● మూడు రోజుల కిందటే ప్రారంభించిన సీఎం
● కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల అభ్యంతరాలు ● ప్రాజెక్టుపై నివేదిక ఇవ్వాలని సూచన

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బయలుసీమ జిల్లాలకు శాశ్వత తాగునీరు కల్పించేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎత్తిపోతల పథకానికి కేంద్రం కొర్రీలు వేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సందిగ్ధంలో పడింది. మూడు రోజుల కిందట హాసన్ జిల్లా సకలేశపుర తాలూకాలో తొలి విడత ప్రాజెక్టును ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ లాంఛనంగా జాతికి అంకితం చేశారు. రెండో విడత పనులు 2027 నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అభ్యంతరాలను లేవనెత్తడంతో ప్రాజెక్టు మనుగడకు ఆటంకం ఏర్పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు ద్వారా పశ్చిమ కనుమలకు నష్టం జరుగుతుందనే ఆరోపణలు రావడంతో కేంద్ర పర్యావరణ శాఖ తీవ్రంగా పరిగణించింది. పశ్చిమ కనుమల పరిధిలోకి వచ్చే కేరళ రాష్ట్రం వయనాడ్‌లో చోటు చేసుకున్న దారుణ సంఘటన తర్వాత కేంద్ర పర్యావరణ శాఖ ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పరిగణిస్తోంది. ఇప్పటికే మహదాయి నది నుంచి కళసా-బండూరి కాలువలను ఐక్యం చేసే ధారవాడతోపాటు మూడు జిల్లాలకు తాగునీటిని సమకూర్చే పనులకు కేంద్ర పర్యావరణ శాఖ అభ్యంతరం తెలిపింది. తాజాగా ఎత్తిపోతల పథకం అమలుపైనా సమగ్ర నివేదిక ఇవ్వాలని కేంద్ర పర్యావరణ శాఖ కోరింది. ఎత్తిపోతల పథకంలో ప్రధానమైన కాలువల నిర్మాణానికి తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా కెంచగానహళ్లి, ఎల్లాపుర గ్రామ పరిధిలోని మారశెట్టిహళ్లి రిజర్వు ఫారెస్టులో 26 ఎకరాల అటవీభూమిని విశ్వేశ్వరయ్య జలమండలికి కేటాయించాలని 2020లో ప్రతిపాదనలు పంపారు. ఇందుకు ఆమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలైలో లేఖ రాసింది. ఇందుకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర అటవీశాఖకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నివేదికను కోరింది. కరువు పీడిత జిల్లాలైన కోలారు, చిక్కబళ్లాపుర, తుమకూరు, రామనగరతోపాటు దేవనహళ్లి పారిశ్రామికవాడకు తాగునీటిని సమకూర్చేందుకు ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. ఇప్పటికే భారీ మొత్తంలో ఖర్చు చేశారు. పశ్చిమ కనుమలలో సున్నితమైన జీవవైవిధ్యంపై ప్రభావం చూపనుందని, ఇటీవల భూమి కుంచించుకుపోయిన ప్రమాదాలను కేంద్ర పర్యావరణశాఖ గుర్తుచేసింది. కరువు జిల్లాలకు తాగునీరు ఇవ్వడం సముచితమైనా పర్యావరణానికి శాశ్వతంగా ఆటంకం కలిగే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ డీఐజీ ప్రణీత పాల్, రాష్ట్ర అదనపు ముఖ్యకార్యదర్శి మంజునాథ్‌కు లేఖ ద్వారా వివరణ కోరినట్టు తెలుస్తోంది.

### అభ్యంతరాలు ఇవే...

ఎత్తిపోతల ప్రాజెక్టుకు 1200 హెక్టార్ల భూమిని వినియోగించుకోవాల్సి ఉంటుంది. అందులో 50 శాతం అటవీశాఖ పరిధికి చెందినట్టు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టులో (డీపీఆర్)లో పేర్కొన్నారు. ప్రస్తుతం 26 ఎకరాల అటవీ భూమిని ఉపయోగించుకుంటున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఇలాంటి ప్రత్యేకమైన ప్రతిపాదనలు సరికాదని, ప్రాజెక్టుకు అవసరమైన సమగ్రమైన భూమి వివరాలు తెలపాలని కేంద్రం సూచించింది. ఎత్తిపోతల పథకం కోసం హాసన్ జిల్లా సకలేశపుర తాలూకాలో 30 ఎకరాల అటవీ భూమిని వినియోగించుకునేందుకు 2016 కర్ణాటక జలవనరుల మండలి ప్రతిపాదనలు చేసింది. రెండో విడతలో 2019లో ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి విశ్లేషణ చేసింది. అనుమతించిన ప్రదేశం కాకుండా ఇతర అటవీ ప్రాంతాల్లోని భూమిని జలవనరులశాఖ వినియోగించిన విషయం వెలుగులోకి వచ్చింది. అటవీ ప్రదేశంలో భూమి వినియోగంపై నివేదిక కోరి ఐదేళ్లు పూర్తయినా ఇప్పటి వరకు సమర్పించలేదు. పరిష్కార పరంగా అటవీభూమిలో ప్రాజెక్టులు కొనసాగించే విధానంపై కేంద్రమంత్రిత్వశాఖకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికలో మార్పు జరిగిన అంశంపై ప్రభుత్వం ప్రమాణ పత్రాలను చెల్లించాల్సి ఉండేది. తీర్థ రామపుర, రాష్ట్ర అటవీశాఖ పరిధిలో ఉంది. వాటికి సంబంధించి స్పష్టత ఇవ్వాలి. వన్యజీవులకు నష్టం కలగకుండా వ్యవహరించాలని హాసన్ సీసీఎఫ్, తుమకూరు డీసీఎఫ్ సిఫారసు చేశాయి. 2023 డిసెంబరు 16న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన లేఖలో వీటి వివరాలను వన్యప్రాణుల అంశాన్ని పొందుపరచలేదు. ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా 24.01 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలని భావిస్తున్నారు. రూ.23,252 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. తొలివిడతలో ప్రాజెక్టుకు రూ.16,076.71 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటికే భారీగా ఖర్చు చేసిన ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నివేదిక కోరడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

# మధుగిరివద్ద ఘోరం



● రోడ్డు ప్రమాదంలో ఆరుగురి మృతి
● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు ● ఎదురెదురుగా ఢీకొన్న కార్లు
● మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు..



మధుగిరి ఆసుపత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, సెప్టెంబరు 9: మధుగిరి తాలూకా కేరేగల పాళ్య సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆరుగురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. పావగడ తాలూకా ఎద్దులపల్లికి చెందిన జనార్దన్‌రెడ్డి కుటుంబం బెంగళూరులో నివాసముంటోంది. వినాయకచవితి పండుగ సందర్భంగా వారు గత శుక్రవారం స్వగ్రామానికి వచ్చారు. పండుగ ముగించుకుని ఆదివారం రాత్రి బెంగళూరుకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మధుగిరికి చెందిన నాగరాజు, డ్రైవర్ సిద్దగంగప్ప వస్తున్న కారు కెరగలపాళ్య వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో జనార్దన్‌రెడ్డి (55), కుమార్తె సింధుజ(30), ఆమె కుమారుడు యోగేష్ (8), మరో కారులోని డ్రైవర్ సిద్దగంగప్ప (52), నాగరాజు(30) అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జనార్దన్‌రెడ్డి కారు డ్రైవర్ ఆనంద్ బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మరణించాడు. ఇతడు కూడా జనార్దన్‌రెడ్డి సమీప బంధువని సమాచారం. అదేవిధంగా జనార్దన్‌రెడ్డి కారులో ప్రయాణిస్తున్న ఆయన బంధువు గీతారాణి, ఆమె పదినెలల కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. వారు తుమకూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, ఎమ్మెల్సీ రాజేంద్ర మధుగిరి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాలను సందర్శించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.



కారు ప్రమాదంలో మృతిచెందిన వారు..

# టీబీ డ్యాం పటిష్టతపై అధ్యయనం

### తనిఖీ చేసిన నిపుణుల కమిటీ

బళ్లారి/రాయదుర్గం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ సోమవారం పరిశీలించింది. తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు (టీబీపీ) సెక్రటరీ ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్‌ఈ శ్రీకాంత్ రెడ్డి, డ్యాం పర్యవేక్షణ ఇంజనీర్లు వారికి స్వాగతం పలికారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ ఛైర్మన్ ఏకే బజాజ్, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ ఎక్స్‌పర్ట్ హర్కేష్ కుమార్, ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్, ఆయా రాష్ట్రాల ప్రతినిధుల బృందం సభ్యులు డ్యాంను పరిశీలించారు. ఏపీ నుంచి బోర్డు సభ్యుడు, సీఈ నాగరాజు, తెలంగాణ నుంచి ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డ్ ఎస్‌ఈ సుధాకర్, కర్ణాటక రిటైర్డ్ సెక్రటరీ సిద్ధగంగప్ప బృందంగా పర్యటించారు. ఆగస్టు 10వ తేదీన ఛైన్ లింక్ తెగిపోయి కొట్టుకుపోయిన 19వ గేటు సహా డ్యాం 33 గేట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆనకట్టపై ఉన్న షట్టర్లతో పాటు రాతి కట్టడాన్ని ఉదయం నుంచి రాత్రి వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. జలాశయానికి ఉన్న 33 క్రస్ట్‌గేట్ల షట్టర్లలో.. 19వ గేట్ మినహా మిగిలిన 32 గేట్లను తనిఖీ చేశారు. ముందుగా ఛైన్ లింకులను పరిశీలించారు. గ్రైడ్ యాంగిల్, కౌంటర్ వెయిట్‌లను పరిశీలించిన అనంతరం రాతికట్టడాన్ని చూశారు. 70 ఏళ్ల క్రితం డ్యాం నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన క్రస్ట్ గేట్ల మందాన్ని అధ్యయనం చేశారు. నీటి అలల ఒత్తిడికి షట్టర్లు మందంలో తేడా వచ్చిందా (అరిగాయా..?) అని ఆరాతీశారు. గతంలో అధ్యయనం చేసినవారు సీడబ్ల్యూసీకి సమర్పించిన నివేదికలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. షట్టర్ల ఆపరేషన్ సిస్టం గురించి డ్యాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలో తొమ్మిది నెలల పాటు జలాశయంలో నీటి నిల్వలు ఉంటాయి. ఈ నేపథ్యంలో గేట్ల నిర్వహణ ఎలా జరుగుతోందని బోర్డు అధికారులను అడిగి, వాటికి సంబంధించిన రికార్డులను సమీక్షించారు. ప్రధానంగా డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (డ్రిప్) కింద కేటాయించిన నిధులు, ఖర్చు పెట్టిన వాటి వివరాలను తెలుసుకున్నారు. జలాశయం గ్రైడ్ యాంగిల్ వద్ద, షట్టర్ల ఛైన్‌లింకుల వద్ద రాతి అరుగుదలను కూడా పూర్తిగా పరిశీలించారు. 70 ఏళ్లుగా నీటిని నిల్వ చేస్తుండడంతో అలలు షట్టర్లను తాకడం, కట్టడాన్ని కూడా బలంగా ఢీ కొడుతుండడం వంటి అంశాల గురించి పరిశీలించారు. అలల వేగాన్ని పరిగణలోకి తీసుకుని సమీక్షిస్తున్నారు. నీటి నిల్వ గురించి పూర్తిగా తెలుసుకుని, ఏఏ నెలలో ఎంత నిల్వ ఉంటుందో రికార్డులను పరిశీలించారు. సమగ్ర నివేదికను మంగళవారం సిద్ధం చేస్తారని బోర్డు అధికారులు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన ఎక్స్‌పర్ట్ కమిటీ సభ్యులు ఏకే బజాజ్, హర్కేష్ కుమార్, తారాపురం సుధాకర్ ఢిల్లీ నుంచి బెంగుళూరు చేరుకున్నారు. అక్కడి నుంచి హొస్పేట్ దగ్గరున్న టీబీ డ్యాంకు ఉదయం చేరుకున్నారు.



తుంగగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ, అధికారులు

# వేగవంతంగా సబర్బన్ ప్రాజెక్టు పనులు

● రైల్వేశాఖ సహాయమంత్రి సోమణ్ణ ● అధికారులతో కేంద్ర, రాష్ట్రమంత్రుల సమీక్ష

బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సబర్బన్ రైలు ప్రాజెక్టు పనులు వేగవంతం చేద్దామని రైల్వేశాఖ సహాయ మంత్రి సోమణ్ణ తెలిపారు. సోమవారం రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్‌తో కలసి విధానసౌధలో రైల్వేప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం సోమణ్ణ మీడియాతో మాట్లాడుతూ 2026లోగా రెండో విడత సబర్బన్ రైల్వే ప్రాజెక్టు ప్రారంభిస్తామని తెలిపారు. రూ.15,700 కోట్లతో 160 కిలోమీటర్ల పొడవైన సబర్బన్ రైల్వే ప్రాజెక్టులకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవలే శంకుస్థాపన చేశారని అందులో రాష్ట్ర ప్రాజెక్టు కూడా ఉందన్నారు. అండర్‌పాస్, ఓవర్‌బ్రిడ్జ్‌లను రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. తుమకూరు - చిత్రదుర్గ రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతం చేయిస్తామన్నారు. 207 కిలోమీటర్ల టెండర్లను మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. విజయపుర, మంగళూరు పోర్టుకు డబ్లింగ్‌లైన్ ఓ దశకు వచ్చిందని, 50ఏళ్లలో సాధ్యం కాని ప్రాజెక్టు త్వరలోనే ముగుస్తుందన్నారు. ధారవాడ - కిత్తూరు రైల్వే లైన్ పరిశీలనలో ఉందన్నారు. ఎంబీ పాటిల్ మాట్లాడుతూ సబర్బన్, మెట్రో ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే అంశంపై చర్చలు జరిపామన్నారు. బెంగళూరు - తుమకూరు మధ్య నాలుగులైన్‌ల విస్తరణ అవుతోందన్నారు. చిత్రదుర్గ, హొసపేట, ఆల్మట్టి మార్గంగా నిర్మాణాలకు సమాచారం ఇచ్చామన్నారు. ఢిల్లీకి వెళ్లి శాఖాపరమైన అంశాలపై కేంద్రమంత్రులతో చర్చించే విషయంలో తప్పు లేదన్నారు. తనకూ వీలుంటే వెళ్లి కేంద్ర మంత్రులతో చర్చిస్తా అన్నారు.



విధానసౌధలో రైల్వేశాఖ సహాయమంత్రి సోమణ్ణను సత్కరిస్తున్న రాష్ట్రమంత్రి ఎంబీ పాటిల్



మైనపు విగ్రహంతో ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే, కుటుంబీకులు

## ధర్మస్థళ ధర్మాధికారి మైనపు విగ్రహం

● పుట్టపర్తిలో తయారీ ● పరిశీలించిన హెగ్డే కుటుంబ సభ్యులు

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినిమా, సామాజిక రంగానికి చెందినవారి మైనపు విగ్రహాలు అక్కడక్కడ ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అదే తరహాలోనే ధర్మస్థళ ధర్మాధికారి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ వీరేంద్రహెగ్డే మైనపు విగ్రహాన్ని బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో సిద్ధం చేయించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోమవారం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. భక్తుడి కోరి మేరకు ఏడాది కాలంగా శిల్పి విగ్రహాన్ని రూపొందించారు. వీరేంద్ర హెగ్డే సంప్రదాయమైన పంచెకట్టు, జుబ్బాలో కనిపించారు. రెండు వారాల కిందట విగ్రహం పూర్తి కావడంతో వీరేంద్రహెగ్డే కుటుంబీకులు సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో విగ్రహాన్ని వీక్షించారు. వీరేంద్రహెగ్డేతో పాటు కుటుంబ సభ్యులు విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయిన వీడియోలు వైరల్ అయ్యాయి. త్వరలోనే ధర్మస్థళకు సదరు విగ్రహాన్ని చేర్చనున్నట్టు సమాచారం.

# జోరుగా విగ్రహాల నిమజ్జనం



సంకి చెరువులో వినాయకుడి నిమజ్జనం



నిమజ్జనానికి తరలిస్తూ..




యడియూరు చెరువులో..

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వినాయకచవితిని పురస్కరించుకుని నగరంలో విగ్రహాల నిమజ్జనం జోరుగా సాగుతోంది. మూడు రోజులుగా నగరంలోని ప్రధానమైన చెరువులలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఒక్క రోజే 2,17,006 విగ్రహాలు నిమజ్జనమైనట్టు బీబీఎంపీ అధికారులు ప్రకటించారు. యడియూరు చెరువులో ఈనెల 11వ తేదీ వరకు మాత్రమే విగ్రహాల నిమజ్జనానికి అవకాశం కల్పించారు. ఇప్పటి వరకు నగరంలోని తూర్పు డివిజన్‌లో 40,791, దక్షిణ విభాగంలో 84,149, దాసరహళ్లి డివిజన్‌లో 1719, ఆర్‌ఆర్‌నగర్‌లో 12,680, పశ్చిమ డివిజన్‌లో 52,429, బొమ్మనహళ్లిలో 3,915, మహదేవపురలో 7,229, యలహంక డివిజన్‌లో 14,094 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు ప్రకటించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనానికి అవకాశం లేదని బీబీఎంపీ అధికారులు తేల్చిచెప్పారు. అటువంటి విగ్రహాలను గుర్తిస్తే అవకాశం ఇవ్వడం లేదన్నారు. కాగా మూడోరోజైన సోమవారం పెద్దసంఖ్యలో విగ్రహాల నిమజ్జనం సాగింది.



హొసనూరు చెరువులో..



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1632.00 | 1,623.38 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 34,983 | 1629 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 34,743 | 9,877 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 101.77 | 71.33 |

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



హుస్సేన్ (ఫైల్)

**కంప్లి, సెప్టెంబరు 9:** విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. సోమవారం బెళగోడు హాళ్ గ్రామానికి చెందిన వర్ద హుస్సేన్ బాషా(28) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెళగోడుహాళ్ గ్రామానికి చెందిన హుస్సేన్ బాషా కంప్లి పట్టణంలో వినాయక మండపాల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశాడు. ఆదివారం రాత్రి పోలీస్ స్టేషన్ పక్కనే మండపంలో విద్యుత్ లైట్లు వెలగక పోవడంతో మరమ్మతులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ కారణంగా అదుపు కిందపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారన్నారు. కంప్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కాలువకు నీరు.. రైతుల హర్షం



భాగవడే కాలువలో ప్రవహిస్తున్న నీరు

**సిరుగుప్ప, సెప్టెంబరు 9 :** బాగవడే కాలువ చివరి ఆయకట్టుకు నీరు రావడంతో రైతులు ఆనందం, ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి భారీ వర్షాలు కురవడంతో 20 ఏళ్ల తర్వాత కాలువకు నీరు పారుతోంది. గతంలో ఈ కాలువ కింద 3400 ఎకరాలు భూములలో వరి పంట సాగు చేసేవారు. వర్షాలు తగ్గడంతో కాలువలకు నీరు రాకపోవడంతో ఎత్తిపోతల పథకం, వర్షంపైనే రైతులు ఆధారపడుతున్నారు. ఇన్నేళ్ల తర్వాత కాలవలో నీరు పారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గడువు పొడిగింపు

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 9:** ఆస్తిపన్ను చెల్లింపు రాయితీ వ్యవధి పొడిగించినట్లు జిల్లా లీగల్ అథారిటీ చైర్మన్ శాంతి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన ఆమె ప్రస్తుత సంవత్సరం ఆస్తి పన్ను చెల్లింపులను పెంచడానికి, స్వీయ పన్ను చెల్లించేలా ప్రజలను ప్రోత్సహించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 30రోజుల లోపు పూర్తి మొత్తంలో పన్ను చెల్లించినట్లయితే 0.5 శాతం రాయితీ వర్తిస్తుందని, గడువు సెప్టెంబర్ 14వరకు పొడిగించినట్లు తెలిపారు. 14న రాష్ట్రీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిల్, మున్సిపల్ కార్పొరేషన్, పట్టణ పంచాయతీ మహానగర్ కార్పొరేషన్ వంటి స్థానిక సంస్థల పరిధిలోని పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## రైతుకు పాముకాటు

**పెనుకొండ రూరల్, సెప్టెంబరు 9:** మండలంలోని కోనాపు రంలో ఉంటికొండ భాస్కర్ అనే రైతు పాముకాటుతో తీవ్ర అస్వస్థత కు గురైనట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. కోనాపురానికి చెం దిన భాస్కర్ ఇంటి పెరటిలో కోళ్లను పెంచడానికి ఓ జాలరీ ఏర్పా టు చేసుకున్నాడు. దాని వైరు తీసే క్రమంలో జాలరీ వద్దకు వెళ్లగా అతడి కుడికాలికి పాముకాటేసింది. దీంతో అతడు ఒక్కసారిగా అ రవడంతో స్థానికులు గమనించి హుటాహుటిన పెనుకొండ ప్రభు త్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పరామర్శించారు.

# గ్యాస్ లీకేజీ జాగ్రత్తలపై నేడు మాక్ డ్రిల్: ఏడీసీ

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 9:** హైవేలపై తిరిగే భారీ వాహనాల్లో ఎల్‌పీజీ గ్యాస్ లీకేజీ జాగ్రత్తలపై ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం మాక్ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఏడీసీ మహ్మద్ జుబేరా తెలిపారు. నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ వీడియో హాల్లో కేంద్ర, రాష్ట్ర విపత్తు, నిర్వహణ బృందాల ఎల్‌పీజీ ప్రదర్శనకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో ప్రాథమిక సమావేశంలో ఆయన మాట్లాడారు. బళ్లారి హొసపేట కొత్త హైవే పై ఉదయం 11గంటలకు మాక్ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర జాతీయ రహదారులపై కర్మాగారాలు ఇతర ఉపయోగాలు అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణ పై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికులు సహకారంతో ఎస్ఆర్‌డీఆర్ఎఫ్ స్కిల్డ్ టీమ్‌లతో ఆపరేషన్ నిర్వహించి వారికి రక్షణ కల్పించాలన్నారు. మాక్ ప్రదర్శనకు వివిధ శాఖలు సహకరించాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ అఖిలేశ్ కమార్ దూబే, ఏఎస్పీ రవికుమార్, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రైవేట్ ఫ్యాక్టరీల అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌డీఎఫ్ అధికారులు, ఏడీసీ తదితరులు

# శిథిలావస్థలో పాఠశాల



శిథిలావస్థకు చేరిన పాఠశాల గది పైకప్పు



దీనావస్థలో గోడలు

**కంప్లి, సెప్టెంబరు 9 :** పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పట్టణంలోని చలవాది సమాజం ప్రభుత్వ పాఠశాల మరమ్మతులకు నోచుకోవాడం లేదు. కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ పాఠశాలలో వందకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఏ సమయంలో కూలుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపైన అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బసప్ప వాపోయారు. పాలకులకు ఈ విషయంపై తెలిపినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది పేద విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారని, ఉపాధ్యాయులు అందుబాటులో వున్నా మరమ్మతులకు నోచుకోకపోవడం దురదృష్టకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని లేకపోతే ఆందోళన చేపడ్తామని గ్రామస్థులు గిరీష్, దివాకర్, మల్లికార్జున తెలిపారు.

# పనులకు తగ్గ వేతనాలు ఇవ్వాలని వినతి

**కంప్లి, సెప్టెంబరు 9:** కుడితిని, కేపీసీఎల్ లోని బీటీపీఎస్‌లో కూలీ కార్మికులకు పనులకు తగ్గ వేతనాలు కాంట్రాక్టర్ ఇవ్వడం లేదని కాంట్రాక్ట్ కూలీ కార్మికుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్ఐ శాంతమూర్తికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేపీసీఎల్ చుట్టుపక్కల కుడితిని, తిమ్మలాపురం, దరోజీ, ఏళబెంచి, సుగ్గినళ్లి, దేవలాపురం, సుల్తాన్‌పురం వివిధ గ్రామాల నుంచి కాంట్రాక్ట్ కింద బీటీపీఎస్‌లో పనులు చేస్తున్నారన్నారు. పలు విభాగాల్లో సుమారు 500 మందికి పైగా పనిచేస్తున్నారన్నారు. వారికి ప్రతినిత్యం కూలీ రూ. 400 నుంచి రూ. 450 అందిస్తున్నారు. ఎనిమిది గంటలకు బదులుగా పది గంటల పాటు పనులు చేయించుకుంటున్నారు. వాహనాలు అందుబాటులో లేవని, సొంతంగా ద్విచక్రవాహనాలపై వచ్చి పనులకు హాజరవుతున్నారన్నారు. తగిన కూలీ చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికసంఘం అధ్యక్షుడురాజశేఖర్



ఎద్దుకు నివాళి అర్పిస్తున్న దుకాణదారులు

## అందరి బంధువు.. బసవన్న..!

సాటి మనిషి కష్టాల్లో ఉన్నా స్పందించని రోజులివి..నడి రోడ్డుపై ప్రమాదం జరిగినా మనకెందుకులే.. అని తప్పించుకునే కాలమిది..కానీ ఓ ఎద్దు మృతి చెందితే ఆత్మీయంగా కర్మ ఖాండలు నిర్వహించి..ఆవేదనతో అంత్యక్రియలు నిర్వహించి గొప్పతనం చాటుకున్నారు ఆ దుకాణదారులు, స్థానికులు. సోమవారం స్థానిక తాలూకా కార్యాలయం వద్ద గుడి ఎద్దు మృతి చెందింది. ఈ ఎద్దు నేతాజీ రోడ్డు నుంచి తాలూకా కార్యాలయం రోడ్డు, రైతు బజారు , రైల్వేస్టేషన్ రోడ్డు వరకు షాపుల వద్ద అని అనేక ప్రాంతాల్లో నిత్యం సంచరించేది. స్థానిక దుకాణ యజమానులు దీనికి ఇడ్లీలు, దోశలు, పండ్లు తదితర వాటిని అందించి ఆకలి తీర్చేవారు. ఎద్దు మృతితో పలు దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక తేరు పేట కల్యాణి వద్ద అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

-హోసూరు

## విశ్వకర్మ జయంతికి ముందస్తు సమావేశం

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 9:** జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 17న విశ్వకర్మ జయంతిని అర్థవంతంగా నిర్వహించనున్నట్లు డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేరా తెలిపారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయ హాల్లో విశ్వకర్మ జయంతిలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 17న నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో చర్చావేదిక కార్యక్రమం జరుగనుంది. అన్ని సంఘాల నాయకులు, ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన తెలిపారు. విశ్వకర్మ జయంతిలో భాగంగా బెంగళూరు రోడ్డులోని కాళికా కమ్మటేశ్వరాలయం నుంచి తేరు బజార్ మీదుగా ఓల్డ్ బ్రూస్‌పేట పోలీస్ స్టేషన్ మార్గం గుండా హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ నుంచి జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరాన్ని చేరుకుంటుందన్నారు. జయంతిని అర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి ఏర్పాటు, తేలికపాటి అల్పాహారం తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ జయంతి కవాతులో సాంస్కృతిక బృందాలు పాల్గొంటాయన్నారు. వేదిక కార్యక్రమంలో సునీత సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు ,వివిధ సంఘాల నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## మరమ్మతులు చేపట్టండి: ఎస్‌యూసీఐ



ఇంజనీర్ హేమరాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌యూసీఐ సభ్యులు

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 9:** నగరంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, తాళూరు రోడ్డులోని గుడారనగర్ నుంచి శ్రీధరగడ్డ వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఎస్‌యూసీఐ డిమాండ్ చేసింది. సోమవారం వారు పలు డిమాండ్లతో ఇంజనీర్ హేమరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కమ్యూనిస్ట్ కమిటీ కార్యదర్శి దేవదాస్ తదితరులు మాట్లాడుతూ బళ్లారి నగరాన్ని ఆనుకుని ఉన్న శ్రీధరగడ్డ రహదారి ఘోరంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇటీవల జిల్లా ప్రధాన న్యాయస్థానం రహదారి సమీపంలో ప్రారంభం కావడంతో ఈ మార్గంలో రద్దీ అధికంగా మారిందన్నారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు రోడ్డు మరింత అధ్వానంగా మారిందని, ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఈసందర్భంగా గ్రామీణ స్థానిక కమిటీ సభ్యులు సోమశేఖర్‌గౌడ, హనుమంతప్ప, గోవింద, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## గణేశ్ మండపాల్లో అన్నదానం



కంప్లిలో అన్నదానం చేస్తున్న సరూప్ సంఘం సభ్యులు

**బళ్లారి సిటీ, సెప్టెంబరు 9:** వినాయక చవితి సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో గణనాథుడు కొలువు దీరాడు. పలు మండపాల్లో మూడో రోజైన సోమవారం అన్నప్రసాద వితరణ జోరుగా సాగింది. పలువురు ప్రముఖులు గణనాథుడిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గణేశ్ మండపాల కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు.

**కంప్లి :** పట్టణంలో పలు ప్రాంతాల్లో మూడవ రోజైన సోమవారం గణనాథుడికి పూజలు ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద జోరుగా అన్నప్రసాద వితరణ జరిగింది. కొన్ని ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జనం చేపట్టారు. పట్టణంలో షరాఫ్ వర్తక సంఘం ఆధ్వర్యంలో అయోధ్యరామ అవతారంలో వినాయకుడు ఆకట్టుకుం టున్నాడు. కురుగోడు పట్టణంలో పాత పోలీస్ స్టేషన్ వద్ద పెద్ద బండరాయికి వెలసిన వినాయకుడికి వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం కంప్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేశారు. అలాగే జెస్కామ్, సత్యనారాయణ పేట, పలు చోట్ల నిమజ్జన కార్యక్రమాలు భాజాభజంత్రీల మధ్య ఘనంగా ఊరేగించారు.

**సిరుగుప్ప :** మూడవ రోజు వినాయకుడు ప్రతిష్ఠాపించిన పలు చోట్ల అన్నదాన సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా విజయనగర కాలనీలో సదాశివ నగర్‌లో, ఆర్టీసీ కాలనీలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గణేషున్ని దర్శనం చేసుకున్నారు. 50 శాతానికి పైగా వినాయకులను సోమవారం తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. మిగిలిన వాటిని ఐదు రోజులు, 7వ రోజు, 9వ రోజు, 11వ రోజు నిమజ్జన కార్యక్రమాలు జరుగనున్నాయి.



కంప్లిలో నిమజ్జనానికి తరలిస్తూ..



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి

## పథకాలను పక్కాగా అమలు చేయాలి

- కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సుభోద్ యాదవ్



మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సుభోద్ యాదవ్

**రాయచూరు సెప్టెంబరు 9:** ప్రత్యేక అవసరాలుగా గుర్తించిన రాయచూరు జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి, కార్యక్రమ ఇన్‌చార్జ్ అధికారి సుభోద్ యాదవ్ సూచించారు. పథకాల అమలుకు సంబంధించి సోమవారం వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో వార్షిక ప్రగతి పరిశీలన సభ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడిన ఆయన వార్షిక ప్రణాళిక ఆధారంగా చేపట్టిన త్రైమాసిక ఫలితాల గురించి ఆరా తీశారు. పథకాల ద్వారా ఎంపికయ్యే లబ్దిదారులను గుర్తింపు మొదలుకుని ప్రభుత్వ పరంగా వారికి అందే సహాయం వరకు ప్రతిశాఖ అధికారి తనవంతు బాధ్యతగా నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు గత ఏడాది కాలంగా చేపట్టిన పనుల గురించి గణాంకాల ఆధారంగా వివరించారు.

# హోసూరు జోన్

## ఘనంగా ఆరోగ్యమాత ఉత్సవాలు



ఆరోగ్యమాత రథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**హోసూరు సెప్టెంబరు 9:** హోసూరు ప్రాంతం మత్తిగిరిల్లో శతాబ్దాల చరిత్ర కలిగిన ఆరోగ్య మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మత్తిగిరి ఆరోగ్యమాత ఆలయం 1924లో నిర్మించబడింది. దీంతో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు, ఆలయం చుట్టు నవనాల్ తిరుపాలి, ప్రత్యేక ఉపన్యాసం, ద్యానం, అని పాలిస్తున్నారు. చిన్న రథాన్ని ఆలయం చుట్టూ తిప్పారు. ధర్మపురి జిల్లా బిషప్ డాక్టర్ , లారెన్స్ పియస్ ఆధ్వర్యంల్లో మదర్ ఆఫ్ గాడ్ చర్చిలో సంబరాలు జరిపారు. ముఖ్య అతిథులుగా ఫాదర్ క్రిస్టోఫర్, రాయపర్, సిస్టర్స్ వేలాది మంది భక్తులు పాల్గొని మాతను దర్శించుకున్నారు.

## పోలీసు వాహనంపైకి రాయి

**ధర్మవరం రూరల్, సెప్టెంబరు 9:** శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలోని గొట్లూరులో ఆదివారం అర్ధరాత్రి పోలీసు వాహనంపై రాయితో దాడి చేశారు. స్థానికులు తెలిపిన మేరకు... గ్రామంలో ఇద్దరు వ్యక్తులు కుటుంబ సమస్యలతో గొడవ పడడంపై డయల్ 100కి ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ నరేంద్ర వాహనంలో సిబ్బందితో కలిసి అక్కడికెళ్లారు. పోలీసు వాహనాన్ని ఆంజనేయస్వామి గుడి ఆవరణలో ఉంచి, గొడవ జరిగే ప్రాంతానికెళ్లారు. అక్కడే ఉన్న కొంతమంది ఆకతాయిలు.. పోలీసు వాహనం వైపు రాయి విసిరారు. అది వాహన అద్దానికి తగిలింది. పోలీసులు.. ఓ యువకుడిని పట్టుకుని, విచారించినట్లు సమాచారం. విషయం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికెళ్లడంతో విచారించినట్లు సమాచారం.

## కలెక్టర్ అభినందనలు

**హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 9 :** ప్యారిస్‌లో జరిగిన ప్యారాఒలింపిక్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించిన హోసూరుకు చెందిన నిత్యశ్రీ శివన్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సరయూ, సబ్‌కలెక్టర్ ప్రియాంక నిత్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడు క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ చెన్నైల్లో నిత్యాశ్రీని కలుసుకుని అక్కడే కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిత్యాశ్రీ ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతూ మన దేశం కోసం ఇలాంటి ఆటల్లో పాల్గొనడం కొనసాగిస్తానని తెలిపారు. బంగారు పథకం సాధించడమే తన ధ్యేయమన్నారు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, కోచ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చీనీ టన్ను రూ.22వేలు

**అనంతపురం రూరల్ :** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయ లు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 67టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు. కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

## ప్రశాంత నిమజ్జనానికి ప్రజలు సహకరించాలి : పోలీసులు

**హోసూరు సెప్టెంబరు 9:** వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరపడానికి ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. వినాయక చవితి సందర్భంగా పలు ప్రాంతాల్లో వినాయకులు కొలువుదీరిన సంగతి తెలిసిందే. 9రోజుల తర్వాత ఈ నెల 15న గణేశ్ నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జనం ఏర్పాట్లను సోమవారం పోలీసులు పరిశీలించారు. పట్టణంలో ఈ ఏడు 350కి పైగా విగ్రహాలు ప్రతిష్ఠించారు. వెస్ట్ జోన్ ఐజీ సెంథిల్ కుమార్, సేలం కార్గో డీఐజీ ఉమ, ఎస్పీ తంగదురై హోసూరుల్లో ఏర్పాట్లను పరిశీలించారు. రామనాయకన్, దర్గా చెరువుల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లను చేయనున్నారు.



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

## దళిత సంఘర్షణ సమితి ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న డీఎస్ఎస్ నాయకులు

**రాయచూరు సెప్టెంబరు 9 :** సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని దళిత సంఘర్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఉన్న టిప్పుసుల్తాన్ గార్డన్‌లో ఆందోళన నిర్వహించిన డీఎస్ఎస్ నాయకులు 30 ఏళ్లుగా రిజర్వేషన్ అమలులో అన్యాయాలకు గురవుతున్న అన్ని ఉపజాతులకు న్యాయం చేయడమే వర్గీకరణ లక్ష్యమన్నారు. గడచిన 30 ఏళ్లుగా సాగించిన పోరాట ఫలితంగా చివరికు సుప్రీం కోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాల పై ఉందన్నారు. వర్గీకరణ అమలుకు సుప్రీం ఆదేశాలను వెంటనే ఈమలులోకి తేవాలన్నారు.

# నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

## విశ్వనాథ సత్యనారాయణ (జయంతి)



కవి సామ్రాట్, పద్మభూషణ్ గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ 1895 సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం నందమూరు గ్రామంలో జన్మించారు. శ్రీమద్రామాయణ కల్పవృక్ష రచనకు తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న ఘనత ఆయనదే. కావ్యాలు, కవితలు, నవలలు, నాటకాలు, పద్యకావ్యము, ప్రయోగాలు, విమర్శలు, వ్యాసాలు, కథలు, చరిత్రలు ఇలా ఆయన పాండిత్య ప్రతిభ జగమెరిగినది. 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్థాన కవిగా గౌరవించింది. కళా ప్రపూర్ణ బిరుదు, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ అందచేసింది. 1976 అక్టోబరు 18న కన్నుమూశారు.

## డాక్టర్ సీఆర్ రావు (జయంతి)



'పద్మ విభూషణ్ గ్రహీత డాక్టర్ కల్యంపూడి రాధాకృష్ణ రావు 1920 సెప్టెంబరు 10న కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా హూవినహడగలి గ్రామంలో తెలుగు కుటుంబంలో జన్మించారు. ఇండో-అమెరికన్ మ్యాథమ్యాటీషియన్, స్టాటిస్టిషియన్, పెన్‌సిల్వేనియా స్టేట్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఎమెరిటస్‌గాను, యూనివర్శిటీ అట్ బఫలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. 2002లో నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ ఇతరత్రా పురస్కారాలు అందుకున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా టాప్ 10 సైంటిస్టులలో ఒకరిగా నిలిచారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మీదుగా వెళ్లే ఒక రోడ్డుకు ఆయన పేరు పెట్టారు. 102 వ యేట 2023 ఆగస్టు 22న పరమపదించారు.

## వడ్డాది పాపయ్య (జయంతి)



వడ్డాది పాపయ్య 1921 సెప్టెంబరు 10న శ్రీకాకుళంలో జన్మించారు. చిత్రకళా జగత్తును మకుటంలేని మహారాజులా నాలుగు దశాబ్దాల పాటు ఏలారు. ఆయన కుంచె పట్టిన తొలినాళ్లలో ప్రముఖ చిత్ర కారులు రాజా రవివర్మ, దురంధర్‌ప్రభావం ఉండేది. తర్వాత తనదైన శైలిలో రాణించి ఇతరులెవరూ అనుకరించడానికి అవకాశం లేనివిధంగా చిత్రాలు గీశారు. మంచి రచయిత, ఫొటోగ్రాఫర్ కూడా. పలు మాస, వారపత్రికలకు ముఖచిత్రాలు గీశారు. ప్రత్యేకించి చందమామ, ఆంధ్రజ్యోతితోపాటు పలు పత్రికలలో చిత్రాలు ప్రచురితమయ్యాయి. 1992 డిసెంబరు 30న పరమపదించారు.

## వై నాయుడమ్మ (జయంతి)



ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రసాయన శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ 1922 సెప్టెంబరు 10న గుంటూరు జిల్లా యలవర్రులో జన్మించారు. మద్రాస్‌లోని ఇన్ స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో శాస్త్రవేత్తగా చేసిన పరిశోధనలు మేళవించగా విజయవంతమయ్యాయి. అమెరికాలో చేసిన పరి శోధనలు కూడా ఫలించాయి. తిరిగి మాతృదేశానికి వచ్చి సెంట్రల్ లెదర్ రీసెర్చ్ యూనివర్సిటీలో శాస్త్రవేత్తగా చేరి లాభదాయక ప్రణాళికలు రూపొందించి చర్మకార పరి శ్రమను ఇతోధికంగా అభివృద్ధి చేశారు. ఈ సంస్థ జాతీయ స్థాయికి ఎదిగింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి నాల్గో వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. పద్మశ్రీ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1985 జూన్ 23న కన్నుమూశారు.

## జాక్ మా (పుట్టినరోజు)



చైనా దేశ వ్యాపార దిగ్గజం జాక్ మాయన్ 1964 సెప్టెంబరు 10న జన్మించారు. పెట్టుబడిదారుడు. అలిబాబా గ్రూప్ సహ సంస్థాపకులు, మాజీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్. స్టార్టప్ పరిశ్రమలకు ఆయన రోల్ మోడల్‌గా నిలిచారు. 2019లో ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ పవర్‌ఫుల్ వ్యక్తుల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. 2021లో ఫోర్బ్స్ ప్రకటించిన ప్రపంచపు శ్రీమంతులలో 26వస్థానంలో నిలిచారు. విద్య, వైద్యం సహా పలు రకాల సమాజసేవ చేస్తూ మానవతావాదిగాను గుర్తింపు పొందారు. ఫౌండేషన్ ద్వారా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. బుద్ధిజం, టావోయిజంలను రెండింటినీ అనుసరించడం ఆయన ప్రత్యేకతగా ఉంది.

## ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రశాంతి నిలయంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

**పుట్టపర్తి:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం సాయంత్రం విద్యార్థులు వినాయక విగ్రహాలను ఊరేగింపుగా సాయికుల్వంత్ సభామండపానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణేశుడిపై భక్తిపాటలు పాడుతూ నృత్యరూపకం ప్రదర్శించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఎనుములపల్లి చెరువులో నిమజ్జనం గావించారు.

## నిమజ్జనం ప్రశాంతంగా సాగాలి: ఎస్పీ

**ధర్మవరం:** వినాయక నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలని జిల్లా ఎస్పీ రత్న సూచించారు. ధర్మవరం చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ సోమవారం పరిశీలించారు. చెరువులో క్రేన్ల సాయంతో వినాయక విగ్రహాలు వేస్తుండటంతో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయించారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# చిక్కబళ్లాపుర - కోలారు మార్గంలో విద్యుత్ రైలు ట్రయల్ రన్

**చింతామణి, సెప్టెంబరు 9:** యలహంక-చిక్కబళ్లాపుర-చింతామణి-కోలారు మార్గంలో బంగారపేట వరకు పదేళ్లుగా సంచరించిన డీజిల్ ఇంజన్ డెము రైలును తాజాగా మెము రైలుగా (విద్యుత్‌తో నడిచేది)గా మార్పుచేశారు. నైరుతిరైల్వేశాఖ ఉన్నతాధికారుల సూచనతో మెము రైలు ప్రారంభించడానికి ముందు విద్యుత్‌తో నడిచే గూడ్స్ రైలు నడిపేందుకు ట్రయల్‌రన్‌కు నిర్వహించారు. దీంతో మూడు రోజులుగా విద్యుత్‌రైలును ట్రయల్‌రన్ సాగుతోంది. 2023 నవంబరులో పాత ఇంజన్ రైలు సదరు మార్గంలో పరీక్షార్థం నిర్వహించారు. 2024 ఫిబ్రవరి 5 నుంచి విద్యుత్‌తో నడిచే రైలు సాధ్యమని భావించారు. సదరు మార్గంలో ఇంకా డీజిల్ రైలు సంచారం ఉండడంతో 2024 మార్చి 7న విద్యుత్‌తో నడిచే గూడ్స్ రైలును ఈ మార్గంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. అనంతరం విద్యుత్‌రైలు సంచారంపై కోలారుకు చెందిన ఆర్‌టిఐ కార్యకర్త ఒకరు నైరుతి రైల్వే బెంగళూరుకు లేఖ రాయగా కొత్త మార్గాలలో రైళ్ల సంచారానికి కొరత ఉందని, ఇక్కడకు నిర్దేశించిన రైలు అయోధ్యనుంచి వాపసు వచ్చాక పరిశీలిస్తామని బదులిచ్చారు. యలహంక-చింతామణి వయా కోలారు నుంచి బంగారపేట నడుమ 149 కిమీ పొడవైన మార్గం విద్యుదీకరణ ఏడాదిక్రితం పూర్తయినా మెము రైలు సంచారానికి నోచుకోకపోవడంపై స్థానికులలో అసంతృప్తి నెలకొంది. తాజాగా ట్రయల్‌రన్ నిర్వహిస్తుండడంతో త్వరలోనే మెము రైలు సంచారం సాధ్యమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



చింతామణి పట్టణంలో విద్యుత్‌రైలుకు పచ్చజెండా

## క్రీడా పోటీలతో ఉపశమనం



తాడు లాగుడు పోటీల్లో ఉపాధ్యాయులు

**బంగారపేట, సెప్టెంబరు 9:** నిత్యం విద్యార్థులకు పాఠాలు, పాఠ్యేతర అంశాల గురించి ఆలోచించే ఉపాధ్యాయులకు ప్రస్తుతం నిర్వహిస్తున్న క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు వారిలో చైతన్యం కల్పించడంతోపాటు ఒత్తిడినుంచి ఉపశమనం కలిగించనున్నాయని బీఈఓ సుకన్య అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఉపాధ్యాయులు తమకు ఆసక్తి ఉన్న క్రీడలు, అలవాట్లను మర్చిపోతున్నా రన్నారు. ఈ తరుణంలో వారిలో చైతన్యం పెంపొందించేలా, వృత్తిలో కొంత ఉపశమనం కల్పించే ఉద్దేశ్యంతో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాస్థాయిలో విస్తరించాలని అభిప్రాయపడ్డారు. ఉట్టి కొట్టడం, మ్యూజికల్ చెయిర్, తాడు లాగుడు తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షుడు కాంతరాజ్ మాట్లాడుతూ ఈ పోటీలతో ఒత్తిడి నియంత్రణకు అవకాశం ఉందన్నారు. సమన్వయ అధికారి ఎంకె శశికళ, తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అప్పయ్యగౌడ, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయగౌడ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**శిడ్లఘట్ట, సెప్టెంబరు 9:** పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు సాంకేతికంగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా న్యూ పెన్షన్ స్కీమ్(ఎన్‌పిఎస్)ను ఉద్యోగులు వ్యతిరేకించడంతో సరికొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)ను అమలు చేసేలా కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ప్రముఖులతో ప్రధాని నరేంద్రమోదీ చర్చలు జరిపి రిటైరైన తర్వాత ఉద్యోగులకు 50శాతం పెన్షన్ ఇచ్చే హామీ ఇచ్చారు. అయితే యుపిఎస్ కూడా ఎన్‌పిఎస్ తరహాలో ఒక తేడా ఉంది. ఉద్యోగుల పెన్షన్ కోసం వేతనంలో 10శాతం కోత విధించనున్నారు. రిటైరయ్యాక ఉద్యోగుల వేతనంలో సదరు కోత విధించిన మొత్తంలో 60శాతాన్ని వాపసు ఇచ్చే అంశంపై స్పష్టత లేదంటూ కొన్ని సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఉద్యోగుల భవిష్యత్తుకు ప్రమాదంగా ఉన్న ఎన్‌పిఎస్, యుపిఎస్ రెండు విధానాలు సమగ్రత లేవని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. శిడ్ల ఘట్ట తాలూకా తహసీల్దార్ కార్యాలయం, తాలూకా పంచాయతీ, ప్రభుత్వ ఆసుపత్రి, బీఈఓ ఆఫీస్, సాంఘక సంక్షేమశాఖ, ఉద్యానవనాలశాఖ తదితర శాఖల ఉద్యోగులు భుజా లకు నల్లబ్యాడ్జీలు కట్టి నిరసన తెలిపారు. నిరసనలో తాలూకా ఎన్‌పిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజేంద్ర, ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, కోశాధికారి నరసింహప్ప, ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మురళిమోహన్, ఉపాధ్యాయులు అశ్వత్థప్ప, వెంకటేశ్, నం దీశ్, నబీ సాహెబ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



తాలూకా కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

## జయనగర్‌లో వినాయక చవితి ఉత్సవం

**బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):** జయనగర్ 1వ బ్లాక్ స్విమ్మింగ్ పూల్ సమీపాన గల విజయ మహాగణపతి దేవస్థానంలో జైగణేశ సేవా సమితి ఆధ్వర్యంలో 41వ వార్షిక గణేశోత్సవం జరుగుతోంది. మంగళవారంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ప్రతిరోజూ విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. పంచామృతాభిషేకం, నవగ్రహ హోమం, రుద్రహోమం, సుబ్రమణ్య హోమం, సత్యనారాయణపూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం అన్న సంతర్పణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

## ఎయిర్‌పోర్ట్‌లో ఏపీ మంత్రికి స్వాగతం



మంత్రిని స్వాగతిస్తున్న బీటీఎఫ్ సభ్యులు

**బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ చిన్నతరహా పరిశ్రమలు గ్రామీణ, పేదరిక నిర్మూలనశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికారు. మంత్రి పలువురు ఐటీ కంపెనీల ముఖ్యులతో చర్చలకు సోమవారం వచ్చారు. ఒకరోజు పర్యటనలో భాగంగా విచ్చేసిన మంత్రికి బెంగళూరు తెలుగుదేశం ఫోరం సభ్యులు శివ, ఫణి, లెనిన్, సురేశ్, ప్రతీశ్, భార్గవ్, చేతన్‌తో పాటు పలువురు స్వాగతించారు.

## శిశుమందిర్‌లో పుస్తకాల పంపిణీ

**బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):** బెంగళూరు గర శివారులోని భత్రహళ్ళి ప్రాంతం శిశుమందిర్ చిన్నారులకు అక్టోపస్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు పుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో శిల్పా శ్రీహరి, దిశాగుప్త, సత్య సెల్వి, మనస్వి సుబ్రమణ్యంతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిల్పాశ్రీహరి మాట్లాడుతూ అక్టోపస్ ఎస్టేట్‌లో శిక్షణ పొంది సౌత్ ఆఫ్రికాలో సేవలు అందిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా శిశుమందిరాలు, వృద్ధాశ్రమాల పట్ల ప్రతి ఒక్కరికి ప్రత్యేక బాధ్యత ఉండాలన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న అక్టోపస్ సంస్థ సభ్యులు

# మైసూరు దసరా ఉత్సవాలకు హంపా?

**బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):** ప్రతిష్ఠాత్మకమైన మైసూరు దసరా ఉత్సవాలకు గడువు సమీపిస్తోంది. ఇప్పటికే గజరాజులు మైసూరుకు చేరుకుని శిక్షణలు పొందుతున్నాయి. అక్టోబరు 3న దసరా ఉత్సవాలను ప్రారంభించాల్సి ఉంది. ఉత్సవాలు ఎవరి చేత ప్రారంభించాలనే అంశంపై కసరత్తు సాగుతోంది. ప్రతిసారి సమాజంలో భిన్నమైన రంగాలలో సేవ చేసినవారికి అవకాశం ఇస్తుంటారు. ఈ మేరకు సాహితీవేత్త హంపా నాగరాజయ్య పేరు పరిశీలించినట్టు తెలుస్తోంది. మైసూరు దసరా ఉత్సవాలకు ఎంతో చరిత్ర ఉంది. మైసూరు మహారాజు 414 ఏళ్లక్రితం దసరా ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీరంగపట్టణంలో తొలుత ఉత్సవాలు ప్రారంభం కాగా ఆ తర్వాత మైసూరుకు మార్చారు. ఏటా నవరాత్రి, విజయదశమిన ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్యాలెస్ మైదానంలోనే ఉత్సవాలు జరుగుతున్నా జంబూసవారి ఊరేగింపు బన్నిమండపం దాకా సాగుతుంది. ఇలా మూడు దశాబ్దాలుగా దసరా ఉత్సవాలను ప్రముఖులచేత ప్రారంభించే ఆనవాయితీ ఉంది. 1988లో శంకర్‌దయాళ్‌శర్మ జంబూసవారికి పుష్పార్చన చేయగా అదే ఏడాది గవర్నర్ వెంకటసుబ్బయ్య జంబూసవారిని ప్రారంభించారు. 1990లో రాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ దసరా మహోత్సవం చివరి రోజున జరిగే జంబూసవారిలో పుష్పార్చన చేశారు. 2007లో గవర్నర్ రామేశ్వర్‌ఠాకూర్ జంబూసవారిని ప్రారంభించారు. రెండేళ్ల కిందట దసరాను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభించారు. ఇలా దసరా ఉత్సవాలు ప్రారంభించిన రెండోరాష్ట్రపతిగా ద్రౌపదిముర్ము నిలిచారు. 1993లో డాక్టర్ రాజ్‌కుమార్ దసరా ఉత్సవాలను ప్రారంభించారు. తర్వాత రెబెల్‌స్టార్ అంబరీశ్, నటి సరోజాదేవి ప్రారంభించారు. 2002లో ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావును ఆహ్వానించినా వివిధ కారణాలతో ఆయన పాల్గొనలేకపోయారు. 2015లో హెచ్‌డీ కోటె తాలూకా హైరగి గ్రామానికి చెందిన సాధారణ రైతు మలారద పుట్టయ్య దసరా ఉత్సవాలను ప్రారంభించారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత యూఆర్ అనంతమూర్తి, సంగీత కళాకారిణి డాక్టర్ గంగూబాయిహానగల్, స్వాతంత్ర్య పోరాట నేత ఎంఎన్ జోయిస్, సాహితీవేత్త దేజగౌ, బరగూరు రామచంద్రప్ప, డాక్టర్ ఎస్ఎల్ భైరప్ప, చంద్రశేఖర్ కంబార, గిరీశ్‌కర్నాడ్, పర్యావరణ రాయబారి సాలుమరద తిమ్మక్క, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ సుధామూర్తి దసరా ఉత్సవాలను ప్రారంభించిన వారిలో ఉన్నారు. వీరితోపాటు ధర్మగురువులు ప్రారంభించిన సందర్భాలు ఉన్నాయి. 2007లో ఆదిచుంచన గిరి మఠాధిపతి బాలగంగాధరనాథస్వామిజీ, 2008లో తుమకూరు సిద్ధగంగామఠాధిపతి డాక్టర్ శివకుమార స్వామిజీ, 2009లో ఆర్ట్‌ఆఫ్ లివింగ్ డాక్టర్ రవిశంకర్ గురూజీ, 2010లో ధర్మస్థళ ధర్మాధికారి డాక్టర్ వీరేంద్ర హెగ్గే, 2011లో పెజావర మఠాధిపతి విశ్వేశతీర్థస్వామిజీ, 2012లో విజయపుర జ్ఞానయోగాశ్రమ సిద్దేశ్వరస్వామిజీ ప్రారంభించారు. బీజేపీ పాలనలో ధర్మగురువులు దసరా ఉత్సవాలు ప్రారంభించగా కాంగ్రెస్ పాలనలో సాహితీవేత్తలు, ప్రగతి పర సాధకుల ద్వారా ప్రారంభించారు. గత ఏడాది సంగీత దర్శకుడు హంసలేఖ ఉత్సవాలు ప్రారంభించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎవరిద్వారా దసరా ఉత్సవాలు ప్రారంభించాలనే దానిపై చర్చ జోరుగా సాగుతోంది. ప్రముఖ సాహితీవేత్త హంపా నాగరాజయ్య పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు ఢిల్లీకి చెందిన ఓ ప్రముఖ కళాకారుడిచేత దసరా ఉత్సవాలు ప్రారంభించడం ద్వారా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టే ఆలోచన కూడా ఉంది.



## అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

**కదిరి అర్బన్, సెప్టెంబరు 9 :** మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో మరాఠీ రమేష్ (34) అతిగా మద్యం తాగి సోమవారం మరణించాడు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలోని నేలపట్ల గ్రామానికి చెందిన ఇతను తన భార్య రమ్య, మేనల్లుడు సతీష్‌తో కలిసి కుమ్మరవాండ్లపల్లిలో కొన్ని సంవత్సరాలుగా నివాసమున్నాడు. వీరు స్టీలు, సిల్వర్ సామన్లు గ్రామాల్లో అమ్ముకుని జీవనం సాగించేవారు. అయితే సతీష్ కొంతకాలంగా ఇళ్ల అద్దెకుని, సొంతంగా వ్యాపారం చేసుకుంటున్నారు. మేనల్లుడ్ని చిన్నప్పటి నుంచి తానే పెంచి.. వ్యాపారం నేర్పించానని, ఇప్పుడు పక్కకెళ్లి వ్యాపారం పెట్టుకున్నాడని రమేష్ రోజు బాధపడుతూ మద్యం తాగేవాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి నిద్రించాడు. సోమవారం అతనిలో చలనం లేకపోవడంతో అతని చుట్టుపక్కల వారి సాయంతో రమేష్‌ను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లకు గాయాలు

**తనకల్లు, సెప్టెంబరు 9:** మండలంలోని సీజీ ప్రాజెక్టు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. కుమారుడూ స్వల్పంగా గాయపడ్డాడు. అమడగూరు మండలంలోని జౌకల చుట్టు పక్కల గ్రామాల నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనం కో సం తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్టుకు భారీగా తరలివచ్చారు. ఇద్దేవాండ్లపల్లికి చెందిన లక్ష్మీదేవి, ఆమె భర్త, ఆమె కుమార్తె హారిక, కుమా రుడు యశ్వంత్ బైక్‌లో నిమజ్జనాన్ని తిలకించడానికి వచ్చారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా... వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి, హారిక తీవ్రంగా, యశ్వంత్ స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ తల్లీకూతుళ్లను 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రిజిస్ట్రేషన్ విధానంపై వివరణ కోరిన గవర్నర్

**బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):** ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లకుండానే అమలు చేసేలా రిజిస్ట్రేషన్ సవరణ చట్టంపై గవర్నర్ వివరణ కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో శాసనసభలో బిల్లుకు ఆమోదం తెలిపారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి హాజరుకాకుండానే రిజిస్ట్రేషన్ అమలు చేసే విధానంతోపాటు డిజిటల్ సంతకాల ప్రక్రియ సవరణ బిల్లు ఆమోదానికై రాజ్‌భవన్‌కు పంపారు. ఈ మేరకు గవర్నర్ బిల్లుకు సంబంధించి వివరణ పంపాలని కోరారు. ఇదే విషయమై రెవెన్యూశాఖ మంత్రి కృష్ణ బైరేగౌడ స్పందిస్తూ గవర్నర్‌కు ఫిబ్రవరిలోనే బిల్లును పంపామన్నారు. వాటికి సంబంధించిన సమగ్ర వివరాలను పొందుపరిచామన్నారు. సందేహం ఉంటే మరోసారి వివరణ ఇస్తామన్నారు.

## ఎమ్మెల్సీ వివాదాస్పద వ్యాఖ్యలు

**బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):** మరోసారి ఏకవచనంతో మాట్లాడితే నాలుక కట్ చేస్తానంటూ ఎమ్మెల్సీ డాక్టర్ చంద్రశేఖర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధలింగప్ప పాటిల్ పేరు చెప్పకనే పరోక్షంగా ప్రస్తావించారు. బీదర్ జిల్లా హుమ్నాబాద్ పట్టణంలో బ్లాక్ కాంగ్రెస్ ఆదివారం ఏర్పాటు అభినందనా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మీకు తోడుగా ఎమ్మెల్సీ భీమరావ్ పాటిల్, తాను ఉన్నామంటూ వేదికపై ఉన్న మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్‌కు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ వ్యాఖ్యల పట్ల బీజేపీ ఆక్రోశం వ్యక్తం చేసింది. బీజేపీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ పాటిల్‌పై కేసు నమోదు చేయాలని లేనిపక్షంలో మంగళవారం హుమ్నాబాద్ పట్టణంలో భారీ నిరసన చేపడతామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధలింగప్ప పాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమనాథ్ పాటిల్ స్థానిక ప్రముఖులంతా కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

## ప్రముఖ సంపాదకుడు వసంత్ నాడిగేర కన్నుమూత



వసంత్ (ఫైల్)

**బెంగళూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):** కన్నడ నాట ప్రముఖ దినపత్రికలలో ఒకటైన సంయుక్త కర్నా టక పత్రిక సంపాదకుడు, సీనియర్ పాత్రికేయుడు వసంత నాడిగేర (59) బెంగళూరులో సోమవారం తెలవారు జామున గుండె పోటుతో కన్నుమూశారు. మూడు దశాబ్దాలుగా కన్నడ పత్రికా రంగంలో కొనసాగారు. కన్నడ ప్రభ, విజయకర్ణాటక, విశ్వవాణి పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించిన ఆయన రెం డేళ్లుగా సంయుక్త కర్ణాటక పత్రికకు కొనసాగు తున్నా రు. ఆయన ఆకస్మిక మృతిపట్ల డీసీఎం డీకే శివ కుమార్ సహా పలువురు మంత్రులు వేర్వేరుగా సంతాపం ప్రకటించారు.

## కూలిన హైమాస్ట్ లైట్లు - తప్పిన పెను ప్రమాదం

**బంగారపేట, సెప్టెంబరు 9:** పట్టణంలోని కారహళ్ళి సర్కిల్‌లో సుమారు 50 అడుగుల ఎత్తులో ఉన్న హైమాస్ లైట్‌లు ఒక్కసారిగా నేలకూలాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో హైమాస్‌లైట్‌కు ఐదు లైట్‌లు ఉన్నాయి. ఆదివారం ఒక్కసారిగా లైట్‌ల సెట్ ఒక్క సారిగా కూలిపోగా అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణా పాయం వాటిల్లలేదు. పురసభ ముఖ్యాధికారి సత్య నారాయణకు సమాచారం తెలియచేయగా ఆయన స్పందించి బెస్కాం అధికారులు, పౌరకార్మికులను పంపి వెంటనే విద్యుత్ సరఫరా ఆపు చేయించారు. పురసభ అధ్యక్షుడు గోవింద ఘటనా స్థలానికి చేరుకుని కింద పడిన విద్యుద్దీపాలను తొలగించేలా చేయించారు. వారం రోజుల్లోగా కొత్తవి అమర్చేలా చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

## గొర్రెల మందపై చిరుత దాడి

**అగళి, సెప్టెంబరు 9:** మండలంలోని కదిరేపల్లి గొల్లహట్టి గ్రామానికి చెందిన మంజు నాథ్ సోమవారం గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. గ్రామ పొలిమేరలో గొర్రెలు మేతమేస్తుండగా ఒక్కసారిగా చిరుత దాడిచేసి ఓ గొర్రెను లాక్కెళ్లి సగం తినేసినట్లు బాధితుడు మంజునాథ్ ఆవేదన వ్యక్తం చేశాడు. చిరుతను చూసి భయపడి కేకలు వేసి గొర్రెలను స్వగ్రామానికి తోలుకొచ్చినట్లు తెలిపాడు. చిరుత సంచారం కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లోని గొర్రెల కాపరులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితుడు వాపోయాడు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

**అనంతపురం క్రైం, సెప్టెంబరు 9:** నగరంలోని గాంధీబజార్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. బుక్కరాయసముద్రానికి చెందిన గోగుల నారాయణ (75) అనే వృద్ధుడు వ్యక్తిగత పనిమీద బత్తలపల్లి వెళ్లి తిరిగి బస్సులో వచ్చి నగరంలోని సంఘమేష్ సర్కిల్ దిగాడు. బుక్కరాయసముద్రం వెళ్లడానికి తాడిపత్రి బస్టాండ్‌కు వెళ్తుండగా బసవన్న కట్ట సమీపంలో ఎక్సెల్ వాహనం వేగంగా వెళ్తూ నారాయణను ఢీకొంది. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు

**అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9:** కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు నియమితుడయ్యారు. అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో ఏఓ గా పనిచేస్తున్న శ్రీనివాసులును ఉద్యోగోన్నతిపై కదిరి ఆర్టీఓగా బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.